# కాంగ్రెస్‌ది అరాచక పాలన

- పాడి రైతు లోన్ చెల్లించలేదని బ్యాంకోళ్లు ఇంటి గేటును ఎత్తుకెళ్తారా?
- నాటి కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు అప్పు కట్టలేదని పుస్తెలు లాక్కెళ్లే దుస్థితి
- నేటి రేవంత్ పాలనలో ఇండ్ల దర్వాజలు కరెంట్ మోటర్లు, స్టార్టర్లు తీసుకెళ్లే ఘోరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): మహిళా రైతు బర్రెల కోసం తీసుకున్న బ్యాంకు రుణం చెల్లించలేదంటూ వారి ఇంటి గేటును తీసుకెళ్తారా? ఇంత దారుణమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పు కింద ఆడబిడ్డల పుస్తెలతాళ్లను కూడా జమచేయించిన దుష్టచరిత్ర కాంగ్రెస్ పార్టీదని మండిపడ్డారు. ఆ దరిద్రపు ఆనవాయితీనే రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని విమర్శించారు. బ్యాంక్ లోన్ కట్టలేదని జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతల గ్రామానికి చెందిన పాడి రైతు ప్రేమలత ఇంటి గేటును బ్యాంకు సిబ్బంది ఎత్తుకుపోవడంపై గురువారం ఒక ప్రకటనలో కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సమైక్యరాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతులు ఎంతటి అరిగోస పడ్డరో, అలాంటి పరిస్థితే మళ్లీ తెలంగాణలో దాపురించిందని విమర్శించారు. ఒకనాటి కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పులు కట్టకపోతే ఇండ్ల దర్వాజలు, కరెంటు మోటర్లు, స్టార్టర్లను అధికారులు ఎత్తుకుపోయేవారని గుర్తుచేశారు.

### రైతులను కడుపులో పెట్టుకున్న కేసీఆర్

ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నన్ని రోజులు రైతులను కడుపులో పెట్టుకుని సాదుకున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. లోన్ కట్టకపోతే ఇంటి గేటును తీసుకురావాలని చెప్పిన అధికారులకు, దొంగలకు పెద్ద తేడా లేదని మండిపడ్డారు. పేదలపై చూపిస్తున్న ఈ ప్రతాపాన్ని పెద్దలపై చూపించగలరా? అని ప్రశ్నించారు. బడా బాబులకు కోట్ల రూపాయల రుణాలను రైట్‌ఆఫ్ (మాఫీ) చేస్తున్న బ్యాంకులు.. పేదల విషయంలో మాత్రం వడ్డీ వ్యాపారుల్లాగా వారి రక్తం తాగుతున్నాయని ఆరోపించారు. పరిస్థితుల ప్రభావంతోనే రైతులు లోన్లు కట్టలేకపోతున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి మాత్రం పదవిని కాపాడుకోవడానికి అడ్డమైన పనులు చేస్తున్నారని విమర్శించారు. రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని మాట తప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీదనే కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. తమను పీక్కుతింటున్న కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకరాలను రైతులు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులను తమ ఇంటి గేటు కూడా తొక్కనీయరని తెలిపారు.

# మరో రైతు ఆత్మహత్య

**దిగుబడులు రాక.. రైతుబంధు అందక • నల్లగొండ జిల్లాలో అన్నదాత బలవన్మరణం**

**ఇప్పటికి రాలిన మట్టిపూలు 426**

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 13 : రైతుబంధు సాయం రాకపోవడంతో అప్పులు తెచ్చి వరి సాగు చేశాడు. నీటి ఎద్దడి కారణంగా పొలం సరిగా పండక, దిగుబడి రాక అప్పులు తీర్చే మార్గం లేక నల్లగొండ జిల్లాలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్సై పిల్లి లోకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కొత్తపేట పంచాయతీ పరిధిలోని ఎర్రకాలువ తండాకు చెందిన రైతు నానావత్ హర్యా(50)కు ఎకరంన్నర పొలం ఉంది. దానిని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి రైతుబంధు సాయం రాకపోవడంతో వానకాలం, యాసంగిలో అప్పులు తెచ్చి వరి సాగు చేశాడు. వానకాంలో సరిగా దిగుబడి రాకపోవడంతో అప్పులు అలాగే మిగిలాయి. యాసంగిలో సాగు చేసిన పొలానికి నీరందక ఒక్కో మడి ఎండుతూ వస్తున్నది. ఈ సారి కూడా దిగుబడి రాదని.. అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి అత్తగారి ఇంటి వద్ద ఉన్న కూతురికి ఫోన్ చేసి 'నిన్ను చూడబుద్ధవుతుంది.. ఇంటికి రమ్మని' చెప్పాడు. గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లిన నానావత్ హర్యా పొలం వద్ద ఉన్న వేపచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తోటి రైతులు వెళ్లి చూసే సరికి అప్పటికే మృతి చెందాడు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ దావాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## లోకం పోకడ




## 19న బీఆర్ఎస్ కార్యవర్గ భేటీ

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రధానంగా చర్చ జరగనున్నది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్రంగా చర్చించనున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలపై చర్చించనున్నట్టు కేటీఆర్ తెలిపారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే కీలక సమావేశం కాబట్టి ఆహ్వానితులందరూ నిర్దేశిత సమయానికి విధిగా హాజరుకావాలని సూచించారు.



ఆమనగల్లులో రైతు దీక్ష నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్. చిత్రంలో వెంకటేశ్ తదితరులు

## 18న ఆమనగల్లులో బీఆర్ఎస్ రైతు దీక్ష

**హాజరుకానున్న కేటీఆర్**

**దీక్షా స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

ఆమనగల్లు, ఫిబ్రవరి 13: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 18న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపడుతున్నట్టు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్వహించే రైతు నిరసన దీక్షకు కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీల నుంచి జన సమీకరణ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం రైతు నిరసన దీక్ష నిర్వహించే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, నేనావత్ అనురాధ స్థానిక నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ రైతు దీక్ష కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ప్రాణం పోయినా భూములివ్వం

- కలెక్టర్‌తో సమావేశానికి హాజరుకాని రోటిబండతండా, పులిచర్లకుంట తండాల పరిధిలోని రైతులు
- లగచర్ల పరిధిలోని అసైన్డ్ భూముల సేకరణకోసం కలెక్టరేట్‌లో మీటింగ్
- భూములివ్వకుంటే కోర్టు ద్వారా తీసుకుంటామంటూ అన్నదాతలకు సంబంధిత అధికారుల బెదిరింపులు
- ప్రభుత్వం తీరుతో భయాందోళనలో బాధిత గిరిజన గ్రామాల రైతులు



వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న లగచర్ల రైతులు

వికారాబాద్, ఫిబ్రవరి 13, (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొండంగల్ నియోజకవర్గం పరిధిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకోసం రైతులను అధికారులు బెదిరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూములివ్వకుంటే కోర్టు ద్వారా ప్రభుత్వమే లాక్కుంటుందని భయాందోళనకు గురి చేస్తున్నట్టు స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకోసం అసైన్డ్ భూముల సేకరణలో భాగంగా గురువారం వివిధ గ్రామాల పరిధిలోని రైతులతో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమావేశమయ్యారు. లగచర్ల గ్రామ పరిధిలో (రోటిబండతండా, పులిచర్లకుంట తండాలు) 102, 117, 120, 121 సర్వే నంబర్లలో కలిపి 110 ఎకరాలు ఉన్నది. ఈ సమావేశానికి రోటిబండతండా, పులిచర్లకుంట తండాల పరిధిలోని 117, 120, 121 సర్వే నంబర్లకు సంబంధించి గిరిజన రైతులు హాజరవ్వనేలేదు. ప్రాణం పోయినా భూమివ్వబోమంటూ ఆయా తండాలకు చెందిన రైతులు అధికారులకు ఇప్పటికే తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలోనే సమావేశానికి ఆ గ్రామాల రైతులు హాజరవలేదని సమాచారం. కాగా, లగచర్లకు చెందిన కొందరు రైతులు హాజరై, భూములిచ్చేందుకు సమ్మతించినట్టు అధికారులు వెల్లడించారు. 102 సర్వే నంబర్‌లో 77 మంది రైతులుండగా 36 మంది రైతులు భూములిచ్చేందుకు ఒప్పుకున్నట్టు అధికారులు తెలిపారు. భూములిచ్చేందుకు ముందుకు రాకుంటే, కోర్టు ద్వారా రైతులకు రూ. 6.50 లక్షలు అందజేసి భూములను తీసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నట్టు గిరిజన రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### గిరిజన రైతులపై అక్కసు

సీఎం సొంత నియోజకవర్గంలో పరిశ్రమలను నెలకొల్పేందుకు జిల్లా యంత్రాంగం ఆపసోపాలు పడుతున్నది. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని లగచర్ల, హకీంపేట, పోలేపల్లి గ్రామాల పరిధిలో మొదట ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా కంపెనీ పెడితే మా బతుకులు ఆగమవుతాయని, ఎట్టిపరిస్థితుల్లో భూమిలిచ్చేది లేదని సంబంధిత గ్రామాల రైతులు తెగేసి చెప్పారు. తదనంతరం భూములివ్వకుంటే లాక్కుంటామని స్థానిక కాంగ్రెస్ నేతలు రైతులపై దౌర్జన్యానికి దిగారు. భూములు బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నించగా, అధికారులపై లగచర్ల రైతులు తిరగబడ్డారు. దీంతో అక్రమ కేసులు పెట్టి రైతులను జైలుకు పంపించారు. లగచర్ల ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కాగా, ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరిగింది. దీంతో ఫార్మా ఇండస్ట్రియల్ పార్కుకు బదులు మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు పేరిట మరోసారి ప్రభుత్వం భూములను సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. అయినప్పటికీ గిరిజన రైతులు మాత్రం భూములిచ్చేది లేదంటూ తెగేసి చెప్తున్నారు. దుద్యాల మండలంలోని లగచర్ల, హకీంపేట, పోలేపల్లి గ్రామాల పరిధిలో 1176 భూములను సేకరించేందుకు నిర్ణయించగా, వీటిలో 533 ఎకరాలు అసైన్డ్ భూములుగా గుర్తించారు. మరో 643 ఎకరాల పట్టా భూములను సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.



హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని గట్లకానిపర్తి శివారులో మోహరించిన పోలీసులు

## గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధితుల నిరసన

### భూములకు రేట్లు నిర్ణయించాలని రైతుల డిమాండ్

శాయంపేట : విజయవాడ –నాగ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి శివారులో నేషనల్ హైవే అధికారులు, సంబంధిత మేఘా కంపెనీ ప్రతినిధులు గురువారం మార్కింగ్ చేశారు. తమ భూములకు ధర నిర్ణయించకుండా మార్కింగ్ చేయడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధర నిర్ణయించి డబ్బులు చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. డివిజన్‌లోని పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే శాయంపేట మండలం గట్లకానిపర్తి శివారు నుంచి వెళ్తున్నది. మూడున్నర కిలోమీటర్ల దూరం హైవేకోసం 34 ఎకరాల భూమిని రైతులు కోల్పోతున్నారు. 85 మంది రైతులు నిర్వాసితులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గ్రీన్ ఫీల్డ్ హైవే కాంట్రాక్టు పనులను మేఘా కంపెనీ చేపట్టినట్టు రైతులు తెలిపారు.

## మానుకోటలో నిర్బంధ సర్వే!

- మహిళలను బయటకు రానీయకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్న అధికారులు
- పోలీస్ బందోబస్తు నడుమ జాతీయ రహదారి కోసం భూసర్వే
- భూములు ఎట్టిపరిస్థితుల్లో ఇవ్వబోమని తేల్చిచెప్పిన గిరిజనులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని సాలార్‌తండాలో గురువారం తెల్లవారుజామునే స్థానిక మహిళలను పోలీసులు నిర్బంధంలో ఉంచి, అధికారులు జాతీయ రహదారి కోసం సర్వే చేశారు. భారీ పోలీస్ బందోబస్తు నడుమ జాతీయ రహదారి (930పీ) నల్లగొండ జిల్లా వలిగొండ నుంచి భద్రాచలం వరకు అధికారులు సర్వే ప్రారంభించారు. అనేక ఏండ్లుగా భూములను నమ్ముకొని జీవిస్తున్నామని, చావనైనా చస్తాం.. కానీ, జాతీయ రహదారికి తమ భూములను ఇచ్చేది లేదని తండావాసులు భూక్యా అనుసూర్య, కల్యాణి, హచ్చి తేల్చి చెప్పారు. పచ్చని పంట పొలాలతోపాటు తమ ఇండ్ల మధ్య నుంచి వలిగొండ టు భద్రాచలం జాతీయ రహదారిని వేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కావాలనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొందరు పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులు డిజైన్ మార్చి కొత్త అలైన్‌మెంట్‌తో సర్వే చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రహదారి కారణంగా సుమారు 140 మంది ఇండ్లు, పచ్చని పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగుతుందని తండావాసులు సర్వేను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, తండావాసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు తండావాసులను వ్యాన్‌లో ఎక్కించి కురవి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సాలార్ తండాలో పోలీసుల భారీ బందోబస్తు



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా విద్యార్థుల భారీ ర్యాలీ

## డంప్‌యార్డుకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ

### బతుకమ్మ ఆడి నిరసన.. పాల్గొన్న విద్యార్థులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 13: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వరుస ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం గుమ్మడిదలలో వందలాది మంది విద్యార్థులు జాతీయ రహదారి 765–డీపై పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల నుంచి పాఠశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. నింగినంటేలా నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. కాగా గుమ్మడిదలలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం దివ్యాంగులు దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు. కాగా నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రిలే నిరాహారదీక్షలు పదోరోజుకు చేరుకున్నాయి. హైకోర్టు ఆదేశం మేరకు సర్వేయర్ ఏడీ బాల్‌రాజ్, మండల సర్వేయర్ యాదయ్య, గుమ్మడిదల తహసీల్దార్ గంగాభవానీ పర్యవేక్షణలో సర్వే చేపట్టారు. ఈనెల 19వ తేదీ వరకు సర్వే చేపడతామని తహసీల్దార్ పేర్కొన్నారు.

# పాలు పారబోసి పాడి రైతుల నిరసన

**పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆందోళన • ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**



రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై పాలను పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పాడి రైతులు

కడ్తాల్, ఫిబ్రవరి 13: ప్రభుత్వం పెండింగ్ పాల బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ పలుచోట్ల పాడి రైతులు గురువారం కూడా ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై గురువారం పాడి రైతులు తమ పాలను పారబోసి నిరసన తెలిపారు. అనంతరం పాలశీతలీకరణ కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తోపాటు బీజేపీ నాయకులు ధర్నాలో పాల్గొని మద్దతు పలికారు. ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీకి పాలుపోస్తున్నా, బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. 74 రోజులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పశు పోషణ భారమైందని, రోజు వారి ఖర్చులు, భోజనం, పిల్లల ఫీజులకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. ఇది రైతు ప్రభుత్వం కాదని, రైతులను వేధించే ప్రభుత్వమని వారు దుయ్యబట్టారు. తమ ఉసురు ప్రభుత్వానికి తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. పాడి రైతులకు బిల్లులు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని అన్నారు. బిల్లులు చెల్లించపోతే అసెంబ్లీని, సచివాలయాన్ని ముట్టడిస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

### రేపు 'చలో విజయ డెయిరీ'

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్న పాడి రైతులు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించనందుకు నిరసనగా శనివారం హైదరాబాద్‌లోని విజయ డెయిరీ ముందు రైతులంతా ఆందోళన చేపట్టనున్నట్టు విజయ డెయిరీ పరిరక్షణ సమితి నాయకులు స్పష్టంచేశారు. రైతులంతా తరలివచ్చి అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. ఏడాదిగా పాడి రైతులకు విజయ డెయిరీ పాల బిల్లులు చెల్లించడంలో జాప్యం చేస్తున్నదని మండిపడ్డారు. 3 నుంచి 5 బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నారని, నెల క్రితం 2 బిల్లులు చెల్లించి, మళ్లీ బిల్లులను నిలిపివేశారని వాపోయారు. 5 బిల్లులకు సంబంధించి 120 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. బిల్లుల జాప్యంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు రైతు నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు.



పెన్‌పహాడ్ మండలం చిన్నగారకుంటతండాలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న రైతులు

## సాగునీటి కోసం రైతుల ఆందోళన


### మోకాళ్లపై నిలబడి నిరసన
### పంటలు ఎండుతున్నాయని ఆవేదన

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 13 : కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంట నీళ్లులేక కండ్ల ముందే ఎండిపోతుండటంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. సూర్యాపేట జిల్లాలో గోదావరి జలాలు రాక, భూగర్భ జలాలు లేక వరి పైర్లు దెబ్బతిన్నాయి. జిల్లాకు చెందిన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో పెన్‌పహాడ్ మండలం చిన్నసీతారాంతండాకు చెందిన రైతులు గురువారం ఆందోళనకు దిగారు. ఎండిన వరి పైర్ల దగ్గర మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు. ఇప్పటికైనా సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

## పంట ఎండిందని రైతు ఆత్మహత్యాయత్నం

### గోదావరి జలాలు అందకపోవడంతో కలత

చివ్వెంల, ఫిబ్రవరి 13 : ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు అందకపోవడంతో ఎండిన పంటను చూసి కలత చెందిన రైతు అదే పొలంలో ఆత్మహత్యకు యత్నంచాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రం పరిధిలోని కుడుకుడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వేములకొండ లక్ష్మయ్యకు 12 ఎకరాల భూమి ఉన్నది. అందులో వరి నాటు పెట్టగా, సాగు నీరు లేక సగానికి పైగా ఎండిపోయింది. ఇటీవల మూడు బోర్లు వేసినా, ఒక్కదాంట్లోనూ నీళ్లు పడలేదు. పంటకు ఇప్పటికే రూ.2 లక్షలకుపైగా పెట్టుబడి పెట్టాడు. ఎస్సారెస్పీ పెద్ద కాల్వ నుంచి పొలంలోకి వచ్చే పిల్ల కాల్వ పూడికకకు మరో రూ.20 వేలు ఖర్చు చేశాడు. అయినా పంటను కాపాడుకునే పరిస్థితి లేకపోవడంతో గురువారం ఉదయం పొలంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా, పక్క పొలం రైతులు గమనించి ఆపారు. లక్ష్మయ్యను అక్కడిని నుంచి ఇంటికి తరలించారు. గతంలో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కాళేశ్వరం జలాలు పుష్కలంగా అందేవని, ఇప్పుడు పంటలు ఆగమవుతున్నాయని లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



యాదాద్రి జిల్లా వలిగొండ మండలం వేములకొండలో యూరియా అందజేయాలని డిమాండ్ చేస్తున్న రైతులు

## యూరియా కోసం రైతుల ఆందోళన

**యాదాద్రి భువనగిరి జిల్లా వేములకొండ, కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లో నిలదీత**

వలిగొండ/తిమ్మాపూర్, ఫిబ్రవరి 13 : యూరియా కొరతను నివారించి రైతులకు సరిపడా అందించాలని రైతులు ఆందోళనకు దిగుతున్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ, కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లో అధికారులను నిలదీశారు. అరూరు పీఏసీఎస్ పరిధిలోని వేములకొండలో రైతుల వెసులు బాటుకోసం యూరియాను అందిస్తున్నారు. నాట్లు వేసుకొని కొద్దిరోజులుగా ఎదురుచూస్తున్నా సరిపడా యూరియా అందక రైతులు ఇబ్బందిపడుతున్నారు. గురువారం పీఏసీఎస్‌కు యూరియా రావడంతో ఒక్కో రైతుకు మూడు బస్తాల చొప్పున అందించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి అధికారులను నిలదీశారు. సరిపడా యూరియాను అందించాలని ఆందోళనకు దిగారు. కాగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ సొసైటీలో గురువారం యూరియా కోసం రైతులు అధికారులు, సిబ్బందితో గొడవకు దిగారు. సొసైటీకి 470 బస్తాలు మాత్రమే రావడంతో కొంతమంది రైతులకు దొరకలేదు. పలుకుబడి ఉన్నవారికి ఎక్కువ బస్తాలు ఇచ్చారని, తమకు ఒకటి కూడా ఇవ్వలేదని పలువురు రైతులు మండిపడ్డారు.